అధ్వానవనం

- బోట్‌క్లబ్ పార్క్‌లో సమస్యలు
- ఎక్కడికక్కడే చెత్త
- ప్రమాదకరంగా విద్యుత్‌వైర్లు
- పాడైన జిమ్ పరికరాలు
- ఇబ్బంది పడుతున్న సందర్శకులు

బోట్‌క్లబ్: అలసిపోయి కాసేపు కుటుంబ సభ్యులతో సేద తీరేందుకు పార్క్‌కు వచ్చిన సందర్శకులకు సమస్యలు ఎదురవుతున్నాయి. చెత్తా చెదారంతో దర్శనమిస్తోంది. అక్కడ కొంత సేపైనా ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయి. అదే స్థానిక ఒకటో డివిజన్‌లోని పిఠాపురం రోడ్డు పక్కనే ఉన్న బోట్‌క్లబ్ ఉద్యాన వనం. ఈ పార్కుకు ఉదయం, సాయంత్రం దాదాపు మూడువేల మందికి పైగా సందర్శకులు వస్తుంటారు. గత రెండు మూడు నెలలుగా పార్కు అధ్వానంగా తయారైంది. అలసిపోయి గుక్కెడు నీరు తాగదామన్న దొరకదు. బెంచ్‌లు అంతంతమాత్రమే ఉన్నాయి. ఏ మూలన చూసిన చెత్తే కనిపిస్తుంది. దీని వల్ల దుర్వాసన వెదజల్లుతోంది. పార్కును శుభ్రం చేసి చెత్తను పలు ప్రాంతాల్లో పోగు చేసి వదలిపెడుతున్నారు. దీంతో యథావిధిగా మారిపోతుంది. కొన్నిచోట్ల వాటికి నిప్పు పెట్టడంతో పార్కు వచ్చే వారు పొగ కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. పార్కులో విద్యుత్ వైర్లు చేతికందే ఎత్తులోనే ఉన్నాయి. దీంతో ప్రమాదాలు జరుగుతాయని ప్రజలు భయపడుతున్నారు.


బోట్‌క్లబ్ పార్కులో పేరుకుపోయిన చెత్తాచెదారం

సమస్యలివే...

చీకటి పడితే అంధకారమే..

పార్కులో సుమారు 10కి పైగా ఇనుప విద్యుత్‌స్తంభాలు విరిగిపోయాయి. దీంతో అక్కడ అంధకారం నెలకొంది. చీకటి పడితే అక్కడికి వాకింగ్, పార్కుకు వచ్చే సందర్శకులు భయపడాల్సిన పరిస్థితి ఉంది. విష పురుగులకు ఆవాసంగా మారింది. ఎప్పుడు ఏ పాము కాటు వేస్తుందోనని ప్రజలు సందర్శకులు భయపడుతున్నారు. అంతే కాకుండా మందు బాబులకు అడ్డాగా మారింది. వారు తాగి మద్యం బాటిల్స్ అక్కడ వదిలేస్తున్నారు.

మరమ్మతులకు గురైన పట్టించుకోరా?

బోట్‌క్లబ్ పార్కులో నాలుగు సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలు ప్రస్తుతం మరమ్మతులకు గురయ్యాయి. వీటికి బాగుజేయడంలేదు. దీంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. బోటక్లబ్‌కు రెండు పక్కల 20కి పైగా జిమ్ పరికరాలు ఉన్నాయి. వీటిలో 6 పరికరాలు ఉపయోగించేందుకు వీలు లేకుండాపోయాయి. చిన్న చిన్న మరమ్మతులు కూడా చేయకపోవడంతో అవికాస్త మూలకు చేరాయి.

రక్షణ లేని ఫీజు బాక్సులు

పార్కులో సుమారు 50కి పైగా విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. వీటికి ఏర్పాటు చేసిన ఫీజు బాక్స్‌లు చేతికి అందేంత ఎత్తులో ఏర్పాటు చేశారు. ఫీజు బాక్సులకు ఉన్న డోర్లుపాడవ్వడంతో వాటికి మరమ్మతులు కూడా చేయకుండా వదిలేశారు. దీంతో చిన్నపిల్లలు పార్కులకు వస్తే ఎక్కడ వాటిని పట్టుకుంటారని తల్లిదండ్రులు భయపడుతున్నారు. పార్కులో 30కిపైగా ఫీజుబాక్సులకు డోర్లు లేవు.

శుభ్రంగా ఉంచాలి



పార్కులో పచ్చగడ్డిపై కూర్చుందామంటే అక్కడక్కడే చెత్తా చెదారం ఉంది. తినిపడేసిన ప్లేటు ఉంటున్నాయి. అవి దుర్వాసన వెదజల్లుతున్నాయి. ప్రతి రోజు చెత్తా చెదారం తీసే ఏర్పాట్లు చేయాలి. పార్కు శుభ్రంగా ఉంచాలి

– సుబ్రహ్మణ్యం, వాకర్

భయపడుతున్నాం..



పార్కులో విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో పిల్లలను తీసుకుని వచ్చేందుకు భయపడుతున్నాం. పిల్లలను ఆడుకోవడానికి ఒంటరిగా పంపాలంటే కూడా ఆందోళనచెందుతున్నాం. ఆదమరిస్తే ఎక్కడ తెలియక వైర్లు పట్టుకుని ప్రమాదానికి గురవుతారెమోనని భయపడుతున్నాం.

– గున్నాబత్తుల స్వామి, వాకర్


పార్కులో చేతికందే ఎత్తులో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం ఫ్యూజ్ బాక్స్

ఫిర్యాదు చేస్తే రశీదు తప్పనిసరి


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం: పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసే ప్రతి ఫిర్యాదుదారుడికి తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని ఎస్పీ బిందు మాధవ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు సూచించారు. శనివారం కాకినాడలోని ఎస్పీ కార్యాలయంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. మహిళల భద్రత కోసం నిర్దేశించిన హెల్ప్ లైన్ నంబర్లను బహిరంగ ప్రదేశాలలో ప్రదర్శించాలని సూచించారు. పెండింగ్ కేసుల దర్యాప్తు త్వరితగతిన చేపట్టాలని ఇందుకు సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కాకినాడ, పెద్దాపురం సబ్ డివిజన్ల పరిధిలో నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్, ఆస్తి సంబంధిత నేరాలను త్వరితగతిన ఛేదించాలని సూచించారు. పోలీస్ అధికారులు గ్రామ సందర్శనలు చేపట్టాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌కు ఓ డ్రోన్‌ను కేటాయిస్తామని తెలిపారు. మహిళా హాస్టళ్ల చుట్టుపక్కల ప్రదేశాలలో సీసీ కెమేరాల ఏర్పాటును పర్యవేక్షించాలని అన్నారు. బహిరంగ మద్యం, కళాశాలు, పాఠశాల సమీపాలలో డ్రోన్ల నిఘాను కొనసాగించాలన్నారు. సమావేశంలో ఏపీపీఎస్సీ గ్రూప్–2 పరీక్షలు, మహాశివరాత్రి, ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బందోబస్తును ముమ్మరం చేయాలన్నారు. అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ట్రైనీ ఏసీపీ సుస్మిత, కాకినాడ ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్, పెద్దపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన


రమణయ్యపేటలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ సతీష్, ఈఓ పీఆర్ అండ్‌ఆర్‌డీ రామాంజనేయులు

కాకినాడ రూరల్: మండలంలోని పలు గ్రామాలలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం ద్వారా ప్రజలకు తడి చెత్త, పొడి చెత్త విడదీసి పారిశుధ్య కార్మికులకు అందజేయడంపై అవగాహన కల్పించినట్టు ఎంపీడీఓ సతీష్, ఈఓ పీఆర్ అండ్‌ఆర్‌డీ రామాంజనేయులు తెలిపారు. రమణయ్యపేట గ్రామంలో వారు పర్యటించి మెరుగైన పారిశుధ్య తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను గోనె సంచిలో భద్రపరిచి నిండిన తరువాత పారిశుధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. రెండో రోజు ఆదివారం గ్రామాలలో పర్యటించి పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం వాకలపూడి గ్రామంలో ఈఓ పీఆర్ అండ్‌ఆర్‌డీ నరసింహరావు పర్యటించి గ్రామస్తులకు తడి, పొడి చెత్త విడదీయడంపై ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రమణయ్యపేట పంచాయతీ కార్యదర్శి నరసింహరావు, వాకలపూడిలో ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త విడిగా సేకరించాలి

కరప: గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహించేటప్పుడు తడి, పొడి చెత్త విడివిడిగా సేకరించి, ఎస్‌డబ్ల్యూసీసీ కేంద్రానికి తరలించాలని డీఎల్‌పీఓ టి.అన్నామణి అన్నారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణ–ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా శనివారం కరప, కొంగోడు, గొర్రిపూడి తదితర గ్రామాల్లో ఆమె పంచాయతీ సిబ్బందితో కలిసి పర్యటించారు. ప్రజలకు ప్లాస్టిక్ వస్తువులు వాడడంతో కలిగే అనర్థాలను, తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ వద్ద సెకండ్‌లెవెల్‌లో తడి.పొడి చెత్తను విడదీసి, వర్మీకంపోస్ట్ తయారీ తదితర అంశాలపై ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు పంచాయతీ సిబ్బందికి, కార్యదర్శులకు అవగాహన కల్పించారు. గ్రామకార్యదర్శులు యు.నిర్మలాదేవి, బి.చంద్రకళ, పి.ఉమామహేశ్వరి, పి.వీరభద్రరావు, పీఎస్‌వీఆర్ బ్రహ్మానందం, కె.వరిజ, పి.సునీల్, డి.దుర్గాభవానీ, పి.సుధాకర్, వై.రాంజీ తదితరులు పారిశుధ్య పనులను పర్యవేక్షించారు.


కరపలో తడి,పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎల్‌పీఓ అన్నామణి

కన్నబాబును కలిసిన నాయకులు


రమణయ్యపేట వైద్యనగర్‌లో కన్నబాబును కలిసి అభినందనలు తెలిపిన వైఎస్సార్ సీపీ నేతలు

కాకినాడ రూరల్: ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కోఆర్డినేటరుగా నియమితులైన మాజీ మంత్రి కురసాల కన్నబాబును యలమంచిలి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. రమణయ్యపేట వైద్యనగర్‌లోని కార్యాలయం వద్ద కన్నబాబుకు పుష్ప గుచ్ఛాలు అందించి అభినందనలు తెలియజేశారు. గజమాలలు వేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారందరిని పరిచయం చేసుకున్న కన్నబాబు వైఎస్సార్ సీపీ పటిష్టం కోసం కలిసి పనిచేద్దామన్నారు.

పన్నుల వసూలే లక్ష్యం కావాలి


నగరపాలక సంస్థ అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ భావన

బోట్‌క్లబ్: పన్నుల వసూలే లక్ష్యంగా అధికారులందరూ పనిచేయాలని నగరపాలకసంస్థ కమిషనర్ భావన నగరపాలక అధికారులు సూచించారు. మొండిబకాయిల వసూల కోసం డివిజన్లలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది, సచివాలయాల సిబ్బందితో శనివారం సమావేశమయ్యారు. పన్నుల వసూలు విషయంలో ఏ మాత్రం అశ్రద్ధ వహించవద్దని సూచించారు. ముఖ్యంగా పన్నుల చెల్లింపు విషయంలో ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించాలన్నారు. అలాగే ప్రతి వార్డుకు నోడల్ ఆఫీసర్, అడ్మిన్, సెక్రటరీలను ఏర్పాటు చేసి పన్నుల వసూలు బాధ్యత అప్పగించాలన్నారు. ఆయా డివిజన్లలో మొండిబకాయిదారుల నుంచి పన్నులను వసూలు చేయడంలో వీరందరూ ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. వార్డులోని పన్నులను నోడల్ ఆఫీసర్, సర్కిల్ పరిధిలోని పన్నులు ఆయా సర్కిల్ ఆఫీసర్లు వసూలు చేయించాలన్నారు. పన్నులపై ఏప్రిల్ నుంచి వడ్డీ పెరిగే అవకాశం ఉందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. అలాగే మార్కెట్ రేటు పెరిగిన నేపథ్యంలో పన్నులు రివైజ్ చేసే అవకాశం ఉందని, ఆ విషయాన్ని కూడా వివరించి పన్ను బకాయిలను త్వరితగతిన చెల్లించేలా అవగాహన కల్పించాలన్నారు. నీటి పన్నులు చెల్లించని మొండిబకాయిదారుల ఇళ్ల వద్ద కుళాయిలను కనెక్షను తొలగించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ కె.టి.సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె.మనోహర్, నగరపాలక కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, మేనేజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షలపై ప్రభుత్వం డ్రామాలు ఆపాలి

కాకినాడ సిటీ: ప్రభుత్వం ఇప్పటికైనా డ్రామాలు ఆపి రోస్టర్ విధానంలో తప్పులను సరి చేసి గ్రూప్–2 పరీక్షలను నిర్వహించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఏపీపీఎస్సీని ఆదేశించకుండా లెటర్ రాశామని తప్పించుకునే ధోరణితో వ్యవహరిస్తుందని ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి జీవి సుందర్ ఆరోపించారు. శనివారం కలెక్టరేట్ ఎదురుగా ఆందోళన చేస్తున్న గ్రూప్–2 విద్యార్థులకు కలిసి ఆయన మద్దతు ప్రకటించారు. నేను ఎమ్మెల్సీగా గెలుపొందిన వెంటనే అభ్యర్థులకు అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. గెలిస్తే మండలిలో గ్రూప్–2 అభ్యర్థుల వాణి వినిపిస్తానని లేని పక్షంలో బయట ఉద్యమిస్తానన్నారు. గ్రూప్–2 పరీక్షలను వాయిదా వేయమని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించకుండా కేవలం రికమెండ్ చేస్తూ లెటర్ రాయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఏపీపీఎస్సీ అనేది ప్రభుత్వంలో భాగమే కదా, గ్రూప్–2 అభ్యర్థుల పోరాటానికి తలొగ్గిన ప్రభుత్వం వాయిదా వేయాలని ఏపీపీఎస్సీకి లేఖ రాసిందన్నారు. ఇది అభ్యర్థుల విజయమని, కూటమి ప్రభుత్వ దుర్మార్గపు వైఖరిపై పోరాటాల విజయమని జీవీ సుందర్ వివరించారు.

ఇంటర్ పరీక్షల్లో మెరుగైన ఉత్తీర్ణత సాధించాలి

కాకినాడ రూరల్: తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ఉజ్వల భవిష్యత్తు కోసం కీలకమైన ఇంటర్మీడియట్ పరీక్షల్లో మెరుగైన ఉత్తీర్ణత సాధించాలని రమణయ్యపేట మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ కోరారు. స్థానిక స్వామి జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులు శనివారం నిర్వహించుకున్న ఫేర్‌వెల్ పార్టీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని తల్లిదండ్రులు కీర్తిని నిలిపేలా పిల్లలు నడుచుకోవాలని, ఇంటర్ పరీక్షలు బాగా రాయాలని కోరారు. కరస్పాండెంట్ స్వామి మాట్లాడుతూ భయపడకుండా పరీక్షలు రాయాలని, పలు మెలుకువలను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రోజి లిల్లీ, అధ్యాపకులు పాల్గొన్నారు.


ఫేర్‌వెల్ పార్టీలో పాల్గొన్న ఇంటర్ విద్యార్థులు

ఆదిత్య నర్సింగ్ విద్యార్థినుల 'కేపింగ్ సెరిమనీ'



జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో నరసింహనాయక్

బాలాజీచెరువు: వైద్యసేవా రంగంలో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశించిన ఆదిత్య నర్సింగ్ సంస్థల విద్యార్థినుల కేపింగ్ సెరిమనీ స్థానిక శ్రీనగర్‌లోని ఆదిత్య అకాడమీ ప్రాంగణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె.నరసింహ నాయక్, గౌరవ అతిథులుగా కాకినాడ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ గ్రేడ్–1 నర్సింగ్ సూపరింటెండెంట్ ఎన్ సంధ్యారాణి, గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్ సీహెచ్ జయశ్రీ హాజరయ్యారు. డాక్టర్ నరసింహనాయక్ మాట్లాడుతూ రోగులకు వైద్యులు మందులు అందిస్తూ, శస్త్రచికిత్సలు వంటి సేవ చేస్తూ వారికి ఊరట కలిగించే మానవతా దృక్పథం గల వృత్తి నర్సింగ్ అని అన్నారు. ఎస్‌సంధ్యారాణి మాట్లాడుతూ రోగులపై అభిమానం ప్రదర్శించాలని, మంచంపై కదలలేని స్థితిలో ఉన్నవారికి బాధ నుంచి ఊరట కలిగేలా మాట్లాడుతూ మందులు వేస్తూ వారు త్వరగా కోలుకునేలా చూడాలన్నారు. సీహెచ్ జయశ్రీ మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్యం అందించే నర్సింగ్ ఒక నోబెల్ ప్రొఫెషన్ అని కొనియాడారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎ.శేషారెడ్డి నర్సింగ్ విద్య ప్రాముఖ్యతను తెలియపరుస్తూ ఆ వృత్తిలో ఉన్నత శిఖరాల నధిరోహించి ఆకర్షణీయమైన వేతనాలతో దేశవిదేశాలలో స్థిరపడే అవకాశాల గురించి వివరించారు. డైరెక్టర్ డాక్టర్ ఎ.సుగుణారెడ్డి, సెక్రటరీ ఎ.కె.దీపక్‌రెడ్డి తదితరులు ప్రసంగించారు. ఆదిత్య నర్సింగ్ అకాడమి ప్రిన్సిపాల్ టి.సెంథిల్ కుమర, నర్సింగ్ విద్యార్థినుల చేత ప్రతిజ్ఞ చేయించారు. నర్సింగ్ కాలేజ్, నర్సింగ్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుండె కవాటాల్లో కాల్షియం పేరుకుపోతే ప్రమాదం


గుండె వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న ఆదినారాయణ

బోట్‌క్లబ్: మన వయస్సు పెరగడం వల్ల గుండె కవాటాల్లో కాల్షియం పేరుకుపోవడం వల్ల గుండె సంబంధిత వ్యాధులు వస్తాయని ప్రముఖ గుండె వైద్య నిపుణులు ఆదినారాయణ అన్నారు. గుండె కవాట వ్యాధి అవగాహన దినోత్సవం సందర్భంగా ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక టీమ్ ఆసుపత్రిలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాయామంతో ఛాతిలో నొప్పి, శ్వాస ఆడకపోవడం, అలసట, పనిచేస్తున్నప్పుడు తలతిరుగుతున్నట్టు, మూర్ఛపోతున్నట్టు అనిపించడం వంటి లక్షణాలు గుండె కవాట వ్యాధుల్లో సాధారణంగా కనిపించే లక్షణాలు అన్నారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ నోటి ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ వహిస్తే మన గుండె ఆరోగ్యం పదిలంగా ఉంచుకోవచ్చునన్నారు.

డిపాజిటర్లకు సొమ్ము అందించేందుకు కృషి

కాకినాడ రూరల్: జయలక్ష్మి సొసైటీ డిపాజిటర్లకు సొమ్ములు అందించేందుకు తమ కార్యవర్గం కృషి చేస్తుందని సొసైటీ కార్యవర్గం చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు పేర్కొన్నారు. కాకినాడ రామారావుపేటలో శనివారం జయలక్ష్మి సొసైటీ డిపాజిటర్ల సమావేశాన్ని వెల్ఫేర్ సంఘ సభ్యులు విశ్వేశ్వరరావు, శంకరం, నరసింగరావు, పళ్లంరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జయలక్ష్మి సొసైటీ చైర్మన్ త్రినాథరావు, సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, డైరెక్టర్లు గౌరీశంకరరావు, చింతా సుబ్బారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూ తమ పాలకవర్గం డిపాజిటర్లకు అండగా మొండి బకాయిలు వసూలకు చేపడుతున్న చర్యలను వివరించి, పురోగతిని తెలియజేశారు. డిపాజిటర్లకు భరోసా కల్పించారు.

దంటు కళాక్షేత్రంలో నేడు నాటిక పోటీలు

బోటక్లబ్: ది కాకినాడ చిల్డ్రన్స్ థియేటర్, దంటు సూర్యారావు స్మారక నాటక కళాపరిషత్‌ల ఆధ్వర్యంలో ఆదివారం దంటు కళాక్షేత్రం ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి చిన్నారుల నాటికలు, సాంస్కృతిక ప్రదర్శనల పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని నిర్వాహకులు దంటు భాస్కరరావు, నాదెళ్ల ప్రభుదాసు శనివారం విలేకర్లకు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన చిన్నారులతో నాటికల ప్రదర్శనలు జరుగుతాయన్నారు. ఉదయం 8.30 గంటల నుంచి ప్రారంభమయ్యే నాటికల పోటీలు రాత్రి వరకూ కొనసాగుతాయన్నారు. ఈ సందర్భంగా దిబ్లూక్రస్ట్ పాఠశాల కాకినాడ వారితో తెనాలి రామకృష్ణ నాటిక, ఉషోదయ మెరిట్ స్కూల్ ఇంద్రపాలెం వారితో అనుసరణ నాటిక, శారదా విద్యాలయం తిమ్మాపురం వారితో సోషల్ మీడియా నాటిక, ఎంపీయూపీ పాఠశాల అచ్చంగి వారితో భిన్నత్వంలో ఏకత్వం నాటిక, వీవీఎస్ హైస్కూల్ ఉప్పాడ కొత్తపల్లి వారితో అడపిల్లలను పుట్టనిద్దాం నాటికలు ప్రదర్శించనున్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ తామరాడ వారితో మాతృదేవోభవ నాటిక, శ్రీఆదర్శ హైస్కూల్ పిఠాపురం వారి ఏరువాక నాటిక, జెడ్పీ ఉన్నత పాఠశాల కోటనందూరు వారితో నేరం ఎవరిది నాటికలు నిర్వహించనున్నారు. చిన్నారులను కళలు, రంగస్థలం వైపు ప్రోత్సహించేందుకు నాటిక ప్రదర్శనలు చేయిస్తున్నారు.

యువకుడి అదృశ్యం

కరప: గ్రామదేవత జాతరకు వెళ్లి తిరిగిరాని యువకుడు అదృశ్యంపై తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు కరప పోలీసలు తెలిపారు. మండలం సిరిపురం గ్రామానికి చెందిన కిర్లంపూడి అప్పలరాజు పెద్దకుమారుడు సత్యశివప్రసాద్ ఈనెల 20వ తేదీన జరిగిన గ్రామదేవతలు గోగులమ్మ, మహాలక్ష్మమ్మల జాతర చూడడానికి వెళ్లాడు. అక్కడ జరిగిన ఒక గొడవను పరిష్కరించుకుని ఇంటికి వచ్చాడు. తర్వాత 21వ తేదీన రాత్రి 11.30 గంటలకు ప్రసాద్ ఇంటి నుంచి బయటకెళ్లి రాలేదు. అప్పటి నుంచి పరిసర గ్రామాల్లోను, బంధువులు, స్నేహితుల గృహాల్లోను గాలించినా ఆచూకీ తెలియలేదు. శనివారం రాత్రి తనకుమారుడు కనిపించడం లేదని తండ్రి అప్పలరాజు కరప పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కరప ఎస్‌ఐ టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్ర బడ్జెట్‌తో అన్ని వర్గాల ప్రజలకు మేలు


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు

బోట్‌క్లబ్: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరేలా కేటాయింపులు ఉన్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన బడ్జెట్ 2025– 26పై మేధావుల అభిప్రాయాలను తెలుసుకొనేందుకు బీజేపీ ఆధ్వర్యంలో నాగమల్లి తోట వద్ద చోడే అప్పారావు ప్రకృతి చికిత్సాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మేధావులు పాల్గొని కేంద్ర బడ్జెట్‌లో వివిధ అంశాలకు ఇచ్చిన ప్రాధాన్యంపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా ఓడల నిర్మాణానికి బడ్జెట్లో పెద్దపీట వేస్తూ 20 వేల కోట్లతో నిధిని ఏర్పాటు చేసి ప్రోత్సహించిందన్నారు. తద్వారా దేశంలో ఓడల నిర్మాణ శాతం పెంచేలా ప్రభుత్వం అడుగులు వేస్తుందని, అన్ని వర్గాల ప్రజలకు సంతృప్తి చెందేలా బడ్జెట్ రూపకల్పన జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పైడా భావన ప్రసాద్, గండి కొండలరావు, ప్రముఖ విద్యావేత్త శ్రీనివాసరావు, పైడా రవీంద్ర, చోడిశెట్టి రమేష్ బాబు, మీడియా ఇన్‌చార్జి తుమ్మలపల్లి నారాయణరావు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎన్ చారిటీస్‌లో ఘనంగా 'విజయీభవ'


విజయీభవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చారిటీస్ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి

బాలాజీచెరువు: స్థానిక ఎంఎస్‌ఎన్ చారిటీస్ ఎంఎస్ నాయకర్ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ‹విజయీభవ› పేరిట సరస్వతి పూజ నిర్వహించారు. అందరికీ ఉచితంగా పెన్నుల పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విజయ కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి చారిటీస్ అసిస్టెంట్ కమిషనర్, విద్యా సంస్థల కరస్పాండెంట్ కె.విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై సరస్వతి దేవి విగ్రహానికి పుష్పాలు సమర్పించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేద గురువులు ఎస్‌టీవీ అవధాని, దేవతార్చన పండిట్ చంద్రమౌళిలు ఆధ్వర్యంలో ముఖ్యఅతిథులు, విద్యార్థులచే సరస్వతి పూజను నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఎంఎస్‌ఎన్ చారిటీస్, ఎంఎస నాయకర్ జూనియర్ కళాశాల్ల పేరిట కరెస్పాండెంట్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ విజయకుమారి పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపకులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఎంఎస్‌ఎన్ చారిటీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

కరప: ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని కూటమి నాయకులు ఓటర్లను అభ్యర్థించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం వేములవాడ గ్రామంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు, ఎన్నికల సమన్వయకర్త నులుకుర్తి వెంకటేశ్వరరావు, కోకోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్, కరప డీసీ చైర్మన్ పుణ్యమంతుల గంగసత్యనారాయణ, దేవు వెంకటేశ్వరరావు, పాలిక సూరిబాబు తదితరులు పట్టభద్రులను కలిసి రాజశేఖర్‌కు మద్దతుగా ప్రచారం చేశారు.

ఆలయ వార్షికోత్సవం

కాకినాడ రూరల్: స్థానిక తిమ్మాపురం ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణం చేసి దశమ వార్షికోత్సవం సందర్భంగా శనివారం స్వామివారికి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు జగదీష్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం స్వామివారి మూల విరాటుకు పంచామృతాభిషేకం నిర్వహించి, విశేషపుష్పాలంకరణ చేశారు. హోమం నిర్వహించారు. గ్రామంలో మహిళలు అధిక సంఖ్యలో కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అభిషేకాలు చేశారు. అంతరం భక్తులకు అన్న సమాధాన నిర్వహించారు. ఆలయ అర్చకులు జగదీష్ శర్మ, ఆలయ కమిటీ గణేష్ యూత్, కార్యక్రమంలో పాల్గొన్నారు.


తిమ్మాపురంలో కలశాలతో స్వామి ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు. వేంకటేశ్వరస్వామి (అంతరచిత్రం)

గణపతి పీఠంలో జపయజ్ఞ పారాయణ

బోట్‌క్లబ్: కాకినాడ సూర్యారావు పేట దూసర్లపూడి వారి వీధిలోని భోగి గణపతి పీఠంలో శ్రీవారి పాదాల వద్ద 73వ జపయజ్ఞ పారాయణ జరిగింది. ఈ సందర్భంగా పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ గోవింద నామాలు పఠిస్తే వేద పురాణ ఉపనిషత్తుల విజ్ఞాన సర్వస్వం అవగతమవుతుందన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.